
సాక్షి ఒడిశా

గురువారం । 23 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కాను కల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇం దులో నగదు రూ.4,90,091లు, బంగారం 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



సంబరం.. స్వాగతం

● నందడిగా సాగిన ఉగాది ఉత్సవాలు

- 8లో



దూసుకొచ్చిన మృత్యువు

● సువర్ణపూర్‌లో కారు దూసుకుపోవడంతో ముగ్గురు విద్యార్థులు మృతి

- 8లో

న్యూస్‌రీల్

పద్మశ్రీ స్వీకరించిన మగుణి కుంవార్



పద్మశ్రీ స్వీకరిస్తున్న మగుణి చరణ్ కుంవార్

భువనేశ్వర్: రాష్ట్రానికి చెందని ప్రముఖ తోలు బొమ్మలాట కళాకారుడు మగుణి చరణ్ కుంవార్ ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. కళారంగంలో విశిష్ట కృషికి ఆయనకు ఈ పురస్కారం లభించడం విశేషం. దేశ రాజధానిలో ఢిల్లీలో బుధవారం అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా దీనిని స్వీకరించారు. కెంజొహర్‌కు చెందిన ఆయన.. ఒడిశా సంప్రదాయ తోలుబొమ్మల నృత్య రూపకం నిరంతర ప్రచారం చేయడంలో నిమగ్నమై ఉండడం విశేషం.

ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరుడు



పచ్చకర్పూర అలంకరణలో స్వామివారు

జయపురం: పట్టణంలోని వైభవ వేంకటేశ్వర స్వామివారిని ఉగాది సందర్భంగా పచ్చ కర్పూరంతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ నేపథ్యంలో స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఏటా ఉగాది సందర్భంగా ఈ విధంగా అలంకరిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి మృతి

మల్కన్‌గిరి: జిల్లా కోరుకొండ సమితి సోమనాథపూర్ పంచాయతీ రంగమ్‌గూడ గ్రామ శివారులో ఉరి వేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రంగమ్‌గూడ గ్రామానికి చెందిన జగన్నాథ బంధామి(35) తనను గుర్తు తెలియని వ్యక్తులు చితకబాది, జేబులోని డబ్బులను ఎత్తుకు పోయారని మంగళవారం మధ్యాహ్నం బలిమెల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై బలిమెల ఐఐసీ జాస్ ఖుజుర్ కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఘటనా స్థలం తర్లకోట గ్రామానికి వెళ్లి, దర్యాప్తు చేపట్టారు. అయితే జగన్నాథకు మతిస్థిమితం లేదని అక్కడి గ్రామస్తులు తెలిపారు. దీంతో అతనిని నిలదీసిన పోలీసులు.. అనంతరం ఇంటి వద్ద వదిలేసి వెళ్లిపోయారు. రోజులాగే బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు.. శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు మృతదేహాన్ని గమనించి బలిమెల పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

పాత కక్షలతో బాంబు దాడి

బరంపురం: నగర శివారు లోని కుకుడఖండి బ్లాక్ పరిధి జోగియాపల్లి గ్రామంలో పాత కక్షలతో ఇరువర్గాలు బాంబులతో దాడి చేసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను పోలీసుల సహకారంతో ఎంకేసీజీ మెడికల్‌లో భర్తీ చేసి, చికిత్స అందిస్తున్నామని ఐఐసీ చిత్రరంజన్ బెహరా తెలిపారు. గంజాం జిల్లా నిమ్మఖండి పోలీసు స్టేషన్ పరిధిలోని జోగియాపల్లి గ్రామంలో గత కొద్ది రోజులుగా ఇరువర్గాల మధ్య రాజుకుంటున్న వివాదాలు తీవ్రస్థాయికి చేరాయి. దీంతో ఒక వర్గంపై మరొకరు బాంబులు వేసుకున్నారు. ఇందులో కలియా పాత్రొ, మహేశ్వర్ దాస్, బలరామ్ సాహు గాయపడగా, చికిత్స పొందుతున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శోభాయమానంగా..

శోభకృత్

- ఉత్సాహంగా ఉగాది వేడుకలు
- సందడిగా గడిపిన తెలుగు వారు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- రాశి ఫలాలను వినిపించిన పండితులు



రాశి ఫలాలను వివరిస్తున్న పండితులు వీవీ రమణ మూర్తి

రాష్ట్రంలోని తెలుగు లోగిళ్లలో ఉగాది వేడుకలు సందడి సాగాయి. షడ్రుచుల పచ్చడి స్వీకరించిన తెలుగువారు.. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మహిళలు, యువత సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. పంచాగ శ్రవణంతో పాటు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: కలస యాత్రలో వేలాదిగా తరలివచ్చిన జనం



పర్లాకిమిడి: పంచాంగ శ్రవణాన్ని ప్రారంభిస్తున్న రూపేష్ పాణిగ్రాహి దంపతులు



భువనేశ్వర్: ఉగాది ఉత్సవ వేదికపై మహిళల కోలాటం



భువనేశ్వర్: ఉగాది ఉత్సవంలో తెలుగు కుటుంబాలు



భువనేశ్వర్: పెద్దలకు తెలుగు సౌరభం సత్కారం



పర్లాకిమిడి: శంకరాచార్య చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

భువనేశ్వర్: శోభకృత్ నామ సంవత్సరం పురస్కరించుకుని ఉగాది ఉత్సవాన్ని వేడుకగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నగరంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. ఉగాది పచ్చడి సేవన, పంచాంగ శ్రవణం తదితర సంప్రదాయ రీతులతో ఆబాల గోపాలాన్ని ఉర్రూతలూగించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆనందోత్సాహాలతో ముంచెత్తాయి. ఉద్యోగరీత్యా మాతృ రాష్ట్రం నుంచి ఖుర్దారోడ్ విచ్చేసిన లోకో పైలట్ తెలుగు కుటుంబాలు ఉమ్మడిగా తెలుగు సౌరభం పతాకం కింద ఉగాది ఉత్సవం-2023 నిర్వహించారు. బాలల్లో సంప్రదాయ ఆచార వ్యవహారాల పట్ల చైతన్య పరిచే క్విజ్ కార్యక్రమాలు, తెలుగుదనం ఉట్టిపడే కోలాటం, భక్తి, సంగీత నృత్యాలు కనువిందు చేశాయి. ఉగాది ఉత్సవం వ్యాఖ్యానం ఆద్యంతం ఆధ్యాత్మిక, ధార్మిక, పౌరాణిక గాథలతో కొనసాగించి ఎస్.రమేష్ ప్రేక్షకుల మన్ననలు పొందారు. పండితుల రఘునాథ శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన పంచాంగ శ్రవణం వార్షిక ఫలితాలతో ప్రధాన పండగ వివరాలను తెలియజేసింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: జిల్లాలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. కుముటిగూడలో అన్నపూర్ణ పరివార్‌కు చెందిన కుటుంబ సభ్యులు నీలకంఠరావు నివాసం వద్ద సంబరాలు జరుపుకొన్నారు. అంతా కలిసి ఉగాది పచ్చడి సేవించారు.

ఆదిత్యవాహిణి ఆధ్వర్యంలో..

పర్లాకిమిడి: పూరీ శంకరాచార్య పీఠం ఆదిత్యవాహిణి, ఆనందవాహిణి ఆధ్వర్యంలో స్థానిక జగన్నాథ మందిరంలో ఉగాది కార్యక్రమాలు నిర్వహించారు. నృసింహచరణ్ పట్నాయక్, ఎస్.అప్పారావు రెడ్డి, అనీల్‌కుమార్ జెన్నా, పట్టణ కార్యదర్శి సంతోష్ ప్రసాద్‌పతి తదితరులు ఆదిగురు శంకరాచార్య చిత్రపటానికి పూజలు జరిపారు. అనంతరం కోట్ల సూరి సహకారంతో భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఆదిత్యవాహిణి సభ్యులు సూర్యనారాయణ ప్రధాన్, సునీల్ జెన్నా తదితరులు పాల్గొన్నారు.



జయపురం: ఉగాది వేడుకల్లో ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు

చైతన్య, కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో..

పర్లాకిమిడి: ఉగాది పురస్కరించుకుని పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉగాది వేడుకలను చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి, కళింగ వైశ్యసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పండితులు వేదంభట్ల వేంకటరమణమూర్తి పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని వైశ్యసంఘం అధ్యక్షుడు వైశ్యరాజు బాలాజీ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. బీజేడీ యువ నాయకులు రూపేష్ పాణిగ్రాహి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని, పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ప్రముఖ వస్త్ర వ్యాపారి బరాటం నాగేశ్వర రావు, వీఎస్‌ఎన్ రాజు, వి.బాలాజీ, రాధికా దంపతులు నూతన పంచాంగాన్ని స్వీకరించారు. వేద పండితులు మాణిక్య మణిశర్మ సమక్షంలో ప్రసాద పంపిణీ చేపట్టారు. అలాగే పెద్ద రాధాకాంత మఠంలో తెలుగు సంవత్సరాది సందర్భంగా సుందరకాండ పారాయణం నిర్వహించారు.



మల్కన్‌గిరి: నీలకంఠరావు నివాసంలో ఉగాది వేడుకలు

జయపురంలో..

జయపురం: పట్టణంలోని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. సరస్వతీ శిశుమందిర్ శారద విహార్ ప్రాంగణంలో ఆర్‌ఎస్‌ఎస్ జయపురం విభాగం నిర్వహించిన కార్యక్రమంలో మహేశ్వర భొత్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ బ్రహ్మ నేడు విశ్వాన్ని సృష్టించిన రోజని, అందుకే ఉగాది నూతన సంవత్సరంగా పరిగణిస్తారని వివరించారు. కార్యక్రమంలో జయపురం పట్టణ ఆర్‌ఎస్‌ఎస్ పరిచాలకులు నిరంజన్ మిశ్రా తదితరులు ప్రసంగించారు.

అంబరాన్నంటిన సంబరాలు

రాయగడ: పట్టణంలో ఈ ఏడాది ఉగాది ఉత్సవాలు అంబరాన్నంటాయి. జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ పేరుతో నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో స్థానిక హోటల్ తేజస్విని వద్ద ఉన్న మైదానంలో జరిగిన ఉత్సవాలకు విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం మజ్జిగౌరి మందిరం నుంచి కలశయాత్ర నిర్వహించారు. ఇందులో ప్రముఖ సినీనటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ పాల్గొన్నారు. వేలాదిమంది పాల్గొన్న ఈ యాత్రలో అడుగడుగునా ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే మహిళల కోలాటం, యువత సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేంగా కనిపించారు.



రాయగడ: తలపై కలశంతో యాంకర్ అనసూయ



రాయగడ: కోలాటం ఆడుతున్న మహిళలు

పాడి పంటలు పుష్కలం

బరంపురం: ఈ ఏడాది పాడి పంటలు పుష్కలం ఉంటాయని, అన్ని వర్గాలకు 60 శాతం వృద్ధి లభిస్తుందని తెలుగు పండితులు డాక్టర్ కొల్లూరి నారాయణరావు తెలిపారు. ఉగాది సందర్భంగా స్థానిక గిరి మార్కెట్ రోడ్డులోని ఆంధ్ర భాషాభివర్ధినీ సమాజం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయానికి మానవ మనుగడతో సంబంధం ఉందని, ఆచారం కులానికి సబంధించినదని తెలిపారు. యుగం ప్రారంభమైనప్పటి నుంచి సంప్రదాయం వస్తోందని, అటువంటి సంప్రదాయాల్లో తెలుగు వారికి ఉగాది పండుగ ప్రధానమైనదని వివరించారు. అలాగే ఉగాది పచ్చడి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో సమాజం ప్రతినిధులు, తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.



బరంపురం: పంచాంగ పఠనం చేస్తున్న తెలుగు పండితులు కొల్లూరి నారాయణరావు



బరంపురం: రాశి ఫలాలు వింటున్న తెలుగు వారు

4 క్వింటాళ్ల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల పోలీసులు ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కలిమెల ఐఐసీ సూర్యప్రకాష్ నాయక్ తన సిబ్బందితో మంగళవారం రాత్రి కూర్మనూర్ ఘాట్ రోడ్డులో పెట్రోలింగ్ నిర్వహించారు. అదే సమయంలో వేగంగా వస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకొని, తనిఖీ చేయగా బస్తాల్లో గంజాయి పట్టుబడింది. దీనిని తూకం వేయగా 400 కిలోలు ఉన్నట్లు గుర్తించారు. సరుకును స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఇరువురూ కూర్మనూర్ పంచాయతీకి చెందిన నింగయా నయస్, బాలయా కోడను ప్రశ్నించగా.. సరుకును ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీని విలువ రూ.40 లక్షలు ఉంటుందని ఐఐసీ వెల్లడించారు. నిందితులను కోర్టులో బుధవారం హాజరు పరిచారు.

లారీ ఢీకొని 6 గేదెలు మృతి

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి సారిసమాల గ్రామం వద్ద బుధవారం అతివేగంగా వస్తున్న లారీ ఢీకొని 6 గేదెలు మృతి చెందాయి. దీంతో డ్రైవర్ వాహనాన్ని వదిలి నుంచి పరారయ్యాడు. గ్రామస్తులు మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండోకు ఫిర్యాదు చేయగా ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత యజమానికి నష్ట పరిహారం అందేలా చేస్తామని హామీ ఇవ్వడంతో పాటు ఘటనపై కేసు నమోదు చేశారు.



రోడ్డుపై మృతిచెంది ఉన్న గేదెలు



గేదెలను ఢీకొన్న లారీ

హోర్డింగ్ ఎక్కిన యువకుడు

- సురక్షితంగా కిందకు దించిన అగ్నిమాపక సిబ్బంది



శిశుభవన్ ఛక్ ప్రాంతంలో హోర్డింగ్ పైకి ఎక్కిన యువకుడు

భువనేశ్వర్: నగరంలోని శిశుభవన్ ఛక్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఓ యువకుడు ఆత్మహత్యకు విఫలయత్నం చేశాడు. 40 అడుగుల హోర్డింగ్ పైకి ఎక్కి, కలకలం సృష్టించాడు. గమనించిన చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. దీంతో 2గంటలు నిరవధికంగా శ్రమించి అతడిని సురక్షితంగా కిందకు తీసుకువచ్చారు. అతనిని స్థానిక క్యాపిటల్ థాణా పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. యువకుడు ఒడిశాలోని బాలాసోర్ జిల్లా సొరొ మండలం అంగులా గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ సందర్భంగా అతని భార్య సుస్మితా పాత్ర మీడియాతో మాట్లాడుతూ తన భర్త భువనేశ్వర్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. తీవ్రమైన పేదరికం కారణంగా ఈ వైపరీత్యానికి పాల్పడి ఉంటాడని అభిప్రాయం వ్యక్తం చేశారు. తల దాచుకునేందుకు నిలువ నీడ లేదని, కుమార్తెల పాఠశాల ఫీజులు కట్టే స్తోమత లేక అల్లాడుతున్నట్లు వాపోయారు. ఈ నేపథ్యంలో తన భర్త ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని వివరించారు.

క్లుప్తంగా

ముంచెత్తిన వాన

- వేణుగోపాలస్వామి గర్భగుడిలోకి వరదనీరు



వేణుగోపాలస్వామి ఆలయ గర్భగుడిలోకి చేరిన వరదనీరు

కవిటి: మండల కేంద్రం కవిటిలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్టాండ్ సమీపంలోని వేణుగోపాలస్వామి ఆలయం గర్భగుడిలోకి వరద నీరు చేరింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ పూడి లక్ష్మణరావు చేరుకొని వరదను పరిశీలించారు. పంచాయతీ యంత్రాంగాన్ని రంగంలోకి దింపారు. మోటారు సాయంతో గుడిలో చేరిన వరదనీటిని తొలగించారు.

ఆరోగ్యభారత్ స్థాపనలో భాగస్వామ్యం కావాలి



ఇందిరాప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఆరోగ్య భారత్ స్థాపనలో అందరూ భాగస్వామ్యం కావాలని, తద్వారా ఆరోగ్య సమాజ స్థాపన సాధ్యపడతుందని జిల్లా వ్యవసాయశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ కూన వేణుగోపాల్ అన్నారు. ఉగాది సందర్భంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ సామాజికవేత్త, స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు జి.ఇందిరాప్రసాద్‌ను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిస్వార్థ సేవకుడుగా పేరు తెచ్చుకున్న ఇందిరాప్రసాద్ వాకర్స్‌కు ఆరోగ్య ప్రదాతగా నిలిచారని కొనియాడారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ.. వాకర్స్ అంతా మానవతా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు ఎస్.జోగినాయుడు, ఎస్.ఈశ్వరరావు, కె.భాస్కరరావు, బెండి శివప్రసాద్ బి.దేవీప్రసాద్, గోలీ సంతోష్, గోలీ ఉమామహేశ్వరరావు, ఎం.మల్లిబాబు, ఎస్.కామేశ్వరరావు, గుడ్ల జగ్గారావు, డాక్టర్ జి.నారాయణరావు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని తండ్రికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జేసీఐ గ్రీన్‌సిటీ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ చదువుతున్న పేద విద్యార్థిని ఎం.యశస్వినికి ఫీజు నిమిత్తం రూ.61 వేలు సాయం ఆమె తండ్రికి అందించారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో గ్రీన్‌సిటీ అధ్యక్షులు మణిశర్మ చేతుల మీదుగా ఈ మొత్తాన్ని అందించారు. ఈ మొత్తంలో వ్యవసాయశాఖ నుంచి రూ.25 వేలు, శాస్త్రి రూ.10 వేలు, న్యూసెంట్రల్ స్కూల్ రూ.5 వేలు, దిలీప్ రూ.5 వేలు, ఉషా రూ.5వేలు సమకూర్చారు. కార్యక్రమంలో హారికాప్రసాద్, గుడ్ల మల్లేశ్వరరావు, వెంకటలక్ష్మి, వనిత, జాడ సాయి పాల్గొన్నారు.

గ్రానైట్ కార్మికుడు మృతి



దిలీప్‌సంఘూ మృతదేహం

కోటబొమ్మాళి: జర్జంగి గ్రామంలోని గోవిందా రాక్స్ గ్రానైట్ కటింగ్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న అసోం రాష్ట్రం ఉదల్‌గురి జిల్లా ఫాకిద్యా గ్రామానికి చెందిన దిలీప్‌సింఘా (43) బుధవారం వేకువజామున ఆకస్మికంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం పరిశ్రమలో పనిముగించుకుని రాత్రి దిలీప్‌సింఘా తోటి కార్మికులతో సహా పరిశ్రమలోనే నిద్రపోయాడు. బుధవారం ఉదయం తోటి కార్మికుడు సుభాజిత్ నాగర్.. దిలీప్‌సింఘాను నిద్రలేపగా లేవలేదు. దీంతో వెంటనే కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకురాగా అప్పటికే దిలీప్‌సింఘా మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. గుండె నొప్పితో మృతిచెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై షేక్ మహమ్మద్ అలి తెలిపారు.

సంబరం.. స్వాగతం

- నందడిగా సాగిన ఉగాది ఉత్సవాలు
- పాల్గొన్న సినీ గేయ రచయిత బల్లా విజయకుమార్



ప్రసంగిస్తున్న గేయ రచయిత బల్లా విజయకుమార్



జానపద గీతాలతో అలరిస్తున్న జానకీరావు బృందం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న తెలుగు సాంస్కృతిక సమితి సభ్యులు



పర్లాకిమిడి: ముఖ్య అతిథిగా హాజరైన టాలీవుడ్ సీనియర్ నటులు సుమన్, బాబుమోహన్



ఉగాది వేడుకల్లో అతిథులను సత్కరిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: హైటెక్ ప్లాజా వేదికపై చిన్నారుల శాస్త్రీయ నృత్యం

జయపురం: పాటలు, మాటలు జీవితంలో ఉత్సాహం, ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలుగు సినీ పాటల రచయిత బల్లా విజయకుమార్ అన్నారు. పట్టణంలోని లాన్ వేదికపై రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు సహకారంతో జయపురం తెలుగు సంస్కృతిక సమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. తెలుగు సంస్కృతిక సమితి అధ్యక్షుడు ధీరేష్ పట్నాయక్, సభ్యులు, జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ... జయపురంలో పుట్టి, పెరిగిన తాను టాలీవుడ్ రచయితగా ఎదిగిన గమనాన్ని తెలియజేశారు. అలాగే పలు ఒడియా, తెలుగు పాటలు పాడి, ఉగ్రాత లూగించారు. అలాగే ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 2 బంగారు పతకాలు సాధించిన విశ్వనాథ్ నాయక్ సహా పలువురు ప్రముఖులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా బీజేడీ అధ్యక్షుడు, కేసీసీబీ చైర్మన్ ఈశ్వరచంద్ర పట్నాయక్, బీజేడీ మహిళ నాయకురాలు డాక్టర్ ఇందిరా నందో, బీజేడీ నాయకులు బి.బాలంకిరావు, జయపురం వైస్‌చైర్మన్ బి.సునీత తదితరులు పాల్గొన్నారు. అనంతరం రేలారే రేలా జానకీరావు బృందం జానపద గీతాలతో శ్రోతలను అలరించారు. ఇందులో భాగంగా తెలుగింటి ఆడపడుచులు ఒక్కొక్కరిగా వేదికపై ఉగాది, షడ్రుచుల ఉగాది పచ్చడి ప్రాధాన్యతను వివరించారు.

శ్రీమందిరంలో దీదీ ప్రార్థనలు

- పూరీ జగన్నాథుని దర్శించుకున్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ
- తమ రాష్ట్ర యాత్రికుల సౌకర్యార్థం వసతి గృహం ఏర్పాటుకు సన్నాహాలు



అతిథి గృహం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ



జగన్నాథుని దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతున్న దీదీ

భువనేశ్వర్: మూడు రోజుల రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ(దీదీ) బుధవారం పూరీ జగన్నాథ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజాదుల్లో పాల్గొన్నారు. ప్రధాన దేవస్థానం సముదాయంలో విమలాపీఠం, మహాలక్ష్మి ఆలయం ఇతర ఉప ఆలయాల్లో దేవతలను దర్శించుకుని ప్రార్థించారు. అలాగే 214 అడుగుల ఎత్తున ఆలయ శిఖరాన నీలచక్రంపై ఏర్పాటు చేసేందుకు పతాకం అందజేశారు. ఆమె ఇచ్చిన జెండాను ఆలయ శిఖరాన అమర్చిన అర్చకవర్గం.. పాత పతాకాన్ని ప్రదానం చేశారు. మమత 2017లో, 2021 ఎన్నికల సమయంలో, పూరీ జగన్నాథ ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి చెందిన అర్చక బృందంతో కోల్‌కతాలోని ఆమె నివాసంలో ప్రత్యేక హోమం చేయించారు. అలాగే జగన్నాథ ధామ్ సందర్శించే పశ్చిమబెంగాల్ పర్యాటకుల వసతి కోసం అతిథి గృహం నిర్మాణం పనులను వేగవంతం చేయడంలో ఆమె ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం గుర్తించిన ప్రతిపాదిత స్థలాన్ని ప్రత్యక్షంగా సందర్శించి, బాగోగులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ సర్వజనుల క్షేమం కోసం ప్రార్థించినట్లు తెలియజేశారు. పూరీ అంతర్జాతీయ విమానాశ్రయం కోసం కేటాయించిన స్థలానికి సమీపంలోని సిపాసరుబలి ప్రాంతంలో కేటాయించిన వసతిగృహ స్థలం పశ్చిమబెంగాల్ పర్యాటకులకు అత్యంత అనుకూలమైనదిగా పేర్కొన్నారు. బెంగాల్ గెస్ట్ హౌస్ కోసం అత్యుత్తమ స్థలం కేటాయించారని.. ఇక్కడ కొత్త విమానాశ్రయం, వంతెన నిర్మితం కానున్నట్లు తెలిపారు. ఇది పూరీలోని అత్యుత్తమ ప్రదేశాలలో ఒకటిగా కానున్నట్లు అభిప్రాయం వ్యక్తంచేశారు. పశ్చిమ బెంగాల్ నుండి పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఏడాదికి కనీసం ఐదు సార్లు పూరీ సందర్శిస్తున్నారు. రథయాత్ర వేసవి సెలవుల వంటి రద్దీ రోజుల్లో సరైన వసతి సౌకర్యం పొందలేక పోతున్నారు. వీరి సౌలభ్యం కోసం అతిథి గృహం నిర్మాణం తలపెట్టినట్లు పేర్కొన్నారు.

నేడు ఇరువురు ముఖ్యమంత్రుల భేటీ..

ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌ను వివిధ సందర్భాల్లో కలిశానని మమతా బెనర్జీ గుర్తు చేసుకున్నారు. హాకీ ప్రపంచకప్ సందర్భంగా తనని ఆహ్వానించారని, రాష్ట్రంలో ఎప్పుడు పర్యటించినా నవీన్‌ను కలుస్తానని తెలిపారు. తాజా పర్యటనలో సైతం ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ కానున్నట్లు వెల్లడించారు. ఇందులో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, ప్రతిపాదిత గెస్ట్‌హౌస్‌పై చర్చిస్తామన్నారు. పూరీలో పశ్చిమబెంగాల్ భక్తులు, పర్యాటకుల కోసం అతిథి భవనం నిర్మించడానికి స్థలం కేటాయించాలని పశ్చిమబెంగాల్ సీఎం అభ్యర్థించారని, ఈ క్రమంలో మమత బెనర్జీకి ప్రతిపాదిత స్థలం చూపించినట్లు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ప్రదీప్ కుమార్ జెనా తెలిపారు. గురువారం జరగనున్న ఇరువురు ముఖ్యమంత్రుల భేటీలో భవనం కోసం ప్రతిపాదించిన స్థలం పట్ల తుది నిర్ణయం ఖరారు చేయనున్నట్లు వివరించారు.

దూసుకొచ్చిన మృత్యువు



శారదపాలి ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల ముందు దుర్ఘటన దృశ్యం

- సువర్ణపూర్ జిల్లాలో కారు దూసుకుపోవడంతో ముగ్గురు విద్యార్థుల మృతి
- రూ.3 లక్షల చెప్పున పరిహారం ప్రకటించిన ప్రభుత్వం

భువనేశ్వర్: ప్రాథమిక పాఠశాల ముందు కారు దూసుకు పోవడంతో ముగ్గురు విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. సువర్ణపూర్ జిల్లా సోన్‌పూర్–బినికా రహదారి ప్రాంతం శారదపాలి ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మృతిచెందగా, మరొకరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే... అర్జున్‌పూర్ నుంచి బినికా వైపు వేగంగా దూసుకు పోతున్న కారు పాఠశాల ఆవరణలో విద్యార్థులను ఢీకొంది. ఇందులో నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడగా, బాధితులను హుటాహుటిన జిల్లా ప్రధాన ఆస్పత్రి(డీహెచ్‌హెచ్)కు తరలించారు. వీరిలో రాజా పేరా, సుబ్రత్ భోయి ఆస్పత్రికి చేరే సమయానికి మృతి చెందినట్లు వైద్య వర్గాలు ప్రకటించాయి. మరో విద్యార్థి రాజేష్ పేరా పరిస్థితి విషమించడంతో ఉన్నత చికిత్స కోసం బుర్లా వీర్ సురేంద్రసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(విమ్సార్)కి తరలిస్తుండగా మార్గం మధ్యలో తుదిశ్వాస విడిచాడు. వీరంతా శారదపాలి ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులు. 8వ తరగతి విద్యార్థి కపిల్ భుయే తీవ్ర గాయాలతో సువర్ణపూర్‌లో చికిత్స పొందుతున్నాడు. ఘటనలో ఆగ్రహానికి గురైన స్థానికులు.. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. దీంతోఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ఆగ్రహించిన స్థానికులు మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించి, డ్రైవర్‌పై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. సోన్‌పూర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అమరేష్ పండా, సబ్ కలెక్టర్ ఇప్సితా పాణిగ్రాహి మిశ్రా ఘటనా స్థలాన్ని సందర్శించి, ఆందోళనకారులను బుజ్జగించి పరిస్థితులను అదుపులోకి తీసుకున్నారు.

మృతుల కుటుంబీకులకు పరిహారం..

సువర్ణపూర్ జిల్లా సోన్‌పూర్ మండలం శారదాపాలి ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల వద్ద జరిగిన కారు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, మరణించిన విద్యార్థుల బంధువులకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన విద్యార్థులకు సరైన వైద్యం అందించాలని ఆదేశించడంతో పాటు, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి రూ.50 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు.

సేంద్రియ సాగు..భలేబాగు



మోహనరావు సాగు చేస్తున్న సారికంద



సొరకాయ సాగు

- కూరగాయాలు, పండ్ల తోటల పెంపకం
- ఆదర్శకంగా నిలుస్తున్న పద్మాపురం రైతు మోహనరావు

సారవకోట: పంటల సాగులో రైతులు వివిధ పద్ధతులు పాటిస్తుంటారు. కొంతమంది పాత విధానాలనే కొనసాగిస్తూ పంటలను పండిస్తే..మరికొందరు మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తుంటారు. సారవకోట మండలం పద్మాపురం గ్రామానికి చెందిన రైతు రావాడ మోహనరావు కూడా కొత్తగా ఆలోచన చేశారు. సేంద్రియ పద్ధతును అవలంబిస్తూ తన కున్న 23 ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేస్తూ మెరుగైన దిగుబడులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కిడిమి గ్రామానికి సమీపంలో కొండలకు సమీపంలో ఉన్న తన భూమిని సాగుకు పనికి వచ్చేలా మార్పుచేసి సేంద్రియ పద్ధతులతో వ్యవసాయం చేస్తున్నాడు. దీంట్లో ముఖ్యంగా కూరగాయాలు, పండ్ల తోటలను వేశారు. రసాయనిక ఎరువుల వాడకంతో అటు నేలతల్లికి మేలు చేస్తున్నాడు. అలాగే మానవుల ఆరోగ్యానికి ఇబ్బంది లేకుండా ప్రకృతి వ్యవసాయాన్ని ఎంచుకున్నాడు. సేంద్రియ పద్ధతులైన ఘన, ద్రవ జీవామృతాలు, నీమాస్త్రం, అగ్ని హస్త్రాలను ఉపయోగించి సొరకాయలు, వంకాయలు, దొండ, బీర, సారికంద, మిరప, చిక్కుడు, బీన్స్, తోటకూర, క్యారెట్, ముల్లంగి తదితర పంటలను సాగు చేస్తున్నాడు. సేంద్రియ పద్ధతులైన ఘన, ద్రవ జీవాస్త్రాల తయారీకి నాటు ఆవులు ఉండాల్సి రావడంతో వాటిని, కోళ్లను పెంచుతున్నారు. ఆవు పేడ, మూత్రాన్ని వినియోగించి తయారు చేసిన ఎరువులతో పంటలను సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం పంటలన్నీ కాపు దశలో ఉన్నాయి. ఈ పద్ధతిలో పంటల సాగులో మరింత మెలకువలు తెలుసుకుని దిగుబడిని పెంచేందుకు కృషి చేస్తున్నారు. అలాగే మరో 60 సెంట్లలో ప్రత్యేకించి అంతర పంటలుగా ఒకే చోట ఏడు రకాల కూరగాయాలైన సొరకాయలు, దొండ, తోటకూర, క్యారెట్, కాకర, బీర, ముల్లంగి పంటలు పండిస్తున్నారు. ఇవేకాక కూరగాయాలు పండిస్తున్న పంట పొలాల చుట్టు ఖాళీ ప్రదేశాలలో 600 కొబ్బరి మొక్కలు, మామిడి, సపోట, నిమ్మ, దానిమ్మ, బొప్పాయి పంటలను పండిస్తూ వాటికి సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. తనకున్న ఖాళీ భూమిలో నాలుగు బోర్లు వేసి మూడింటికి విద్యుత్, ఒకటి సోలార్ పద్ధతిలో నడిచేటట్లు ఏర్పాటు చేసి స్ప్రింకలింగ్ విధానంలో నీరు వృథా కాకుండా చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరోగ్యకరమైన కూరలు అందించాలని..



ప్రస్తుత రోజుల్లో ఎవరికీ పెద్దగా తిండికి లోటు లేదు. కానీ సరైన.. ఆరోగ్యకరమైన ఆహారం తినాలని ఉన్నా సాధ్యం కావడం లేదు. రసాయనిక ఎరువుల వాడకంతో సాగుచేస్తున్న పంటల కారణంగా ఆస్థాయి తిండి తినలేక పోతున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం కోసం ఎదురు చూస్తున్నందున వారికి మంచి కూరలు అందించాలని.. పలువురికి ఆదర్శంగా నిలవాలని సేంద్రియ పంటల సాగు పద్ధతిని ఎంచుకున్నాను. దీనికి ఆర్‌బీకే, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తున్నా.

రావాడ మోహనరావు, రైతు, పద్మాపురం

కల్యాణ మహోత్సవానికి వేళాయె..

- 28 నుంచి ఆదిత్యుని వార్షిక కల్యాణ మహోత్సవాలు
- వచ్చే నెల 1న కల్యాణం, 5న పుష్పయాగం



కల్యాణ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్, ఈవో, ప్రధానార్చకులు

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్షదైవం సూర్యనారాయణ స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవానికి వేళయ్యింది. ఈనెల 28వ తేదీ చైత్రశుద్ధ సప్తమి నుంచి వచ్చే నెల ఐదో తేదీ చతుర్దశి వరకు స్వామి వారి ఆలయ అనివెట్టి మండపంలో జరగనున్న కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఆర్డీవో శాంతి, ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు వార్షిక కల్యాణ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కల్యాణ మహోత్సవాలను గతంలో కంటే ఘనంగా నిర్వహించాలని, ఏర్పాట్లలో భాగంగా వివిధ శాఖలను సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో బి.శాంతి, పాలకమండలి సభ్యులు మండవల్లి రవి, ఎస్.కె.చౌదరి పాల్గొన్నారు.

కల్యాణ ఘట్టాలివే..

- కల్యాణోత్సవాల్లో తొలి ఘట్టంగా ఈనెల 28వతేదీ సాయంత్రం ఆరు గంటలకు కల్యాణాంగ ధ్వజారోహణం, పతాకావిష్కరణ
- 31 సాయంత్రం ఏడు గంటలకు సుగంధద్రవ్య మర్ధన (కొట్నం దంపు)
- ఏప్రిల్ 1న ఏకాదశి ముహూర్తాన రాత్రి 7 గంటల నుంచి కల్యాణ మహోత్సవం
- 2న ఆగ్నేయ స్థాలీపాక హోమాదులు
- 3న వేద పండిత సదస్సు, సత్కారాలు, రథోత్సవం
- 4న తిరుమంగయాళ్వారుల చరిత్ర, సంవాద విన్నపాల ఘట్టం
- 5న ఉదయం 8 గంటలకు సుమంగళి అర్చన, అనంతరం ధ్వజావరోహణం, సాయంత్రం 7 గంటలకు పుష్పయాగ మహోత్సవంతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.

ఆలయంలోనే టిక్కెట్ల విక్రయాలు

వచ్చే నెల ఒకటో తేదీన జరగనున్న ఆదిత్యుని వార్షిక కల్యాణోత్సవానికి సంబంధించి కల్యాణ టిక్కెట్లు రూ.500 (ఇద్దరు/ దంపతులకు అనుమతి), ప్రత్యేక టిక్కెట్లను ఆలయంలోనే విక్రయించనున్నామని ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. అలాగే వార్షిక కల్యాణ సేవకు గతంలో నగదు చెల్లించిన వారు నేరుగా రశీదులతో పాటు కల్యాణ సేవలో పాల్గొనే అవకాశం ఉంటుందని వివరించారు. సేవకు హాజరైన వారికి స్వామి వారి శేష వస్త్రాలను అందజేస్తామని, దూరాన ఉన్న వారికి తలంబ్రాలు, శేషవస్త్రాలను పోస్టల్‌లో పంపిస్తామని వివరించారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మిక శోభ



వెలమపేటలో సాగుతున్న సీతారాముల ఉత్సవ విగ్రహాల తిరువీధి

సాలూరు: ఉగాది పర్వదినాన సాలూరు పట్టణంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. సీతారాముల నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వెలమపేట, వెంకటేశ్వరకాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం సీతారాములు ఉత్సవ విగ్రహాల తిరువీధి వైభవంగా సాగింది. భక్తులు భక్తి శ్రద్ధలతో భజనలు చేశారు. జై శ్రీరామ్ అంటూ ముందుకు సాగారు. పలు ఆలయాల్లో పంచాగ శ్రవణాలకు భక్తులు హాజరయ్యారు.

దేవీ దండుమారమ్మ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారికి వస్త్రాలు సమర్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి దంపతులు

విజయనగరం క్రైమ్: దేవీదండుమారమ్మ దేవాలయంలో అమ్మవారి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 28వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల ప్రారంభ వేడుకల్లో జిల్లా ఆర్మ్డ్ రిజర్వు డీఎస్పీ ఎల్.శేషాద్రి దంపతులు పాల్గొన్నారు. వీరికి ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి విశిష్ట పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ నెల 24న సామూహిక కుంకుమ పూజలు, 28న అమ్మవారి ఊరేగింపు, సాయంత్రం 5.30 గంటలకు సాంస్కృతిక ప్రదర్శనల నడుమ అమ్మవారి తిరువీధి కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, పి.జగ్గారావు, యు.అప్పన్న, కె.రాంబాబు, ఎల్.మోహనరావు, సత్యనారాయణ, ఎం.రమేష్, పి.శ్రీనివాసరావు, కె.నాగరాజు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం..



భామిని: సింగిడిలో కురుస్తున్న భారీ వర్షం

భామిని: మండలంలో బుధవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. బత్తిలి నుంచి భామిని వరకు కుండపోతగా కురిసిన వర్షంతో రాకపోకలు స్తంభించాయి. ఈదురు గాలులకు మామిడి, జీడి, చింత తోటలకు నష్టం వాటిల్లింది.

ద్విచక్రవాహనం బోల్తా: మహిళకు గాయాలు

వేపాడ: మండలంలోని చిరతపాలెం జంక్షన్ సమీపంలో ద్విచక్రవాహనం గుంతలో పడి బోల్తా కొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళ గాయాలపాలైంది. ఈ ప్రమాదానికి సంబంధించి దేవరాపల్లి 108 సిబ్బంది అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోటకు చెందిన పిల్లి శివప్రసాద్ భార్య కుమారి ఇద్దరు పిల్లలతో కలిసి బైక్‌పై కోటపాడు వెళ్తున్నారు. చిరతపాలెం సమీపంలో బక్కునాయుడు చెరువు వద్ద ద్విచక్రవాహనం గుంతలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మహిళ తలకు గాయం కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. దీంతో సంఘటానా స్థలానికి 108 వాహనం చేరుకుని గాయాలపాలైన మహిళను ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది.

పిడుగుపాటుకు 8 మేకల మృతి

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో బుధవారం పిడుగుపాటుకు గుర్రై ఎనిమిది మేకలు మృతి చెందాయని పోరాం పశువైద్యాధికారి కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రైతు కొన సంతోష్‌కు చెందిన మేకలను మేతకు తీసుకెళ్తున్న సమయంలో పిడుగు పడటంతో ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు.

‘ఉపాధి’తో ఉద్యానవనాలు



బంతిపూల తోట (ఫైల్ ఫోటో)



కొబ్బరితోటలో అంతర పంటల సాగు

- ఉచితంగా మొక్కల పంపిణీ, సంరక్షణ బాధ్యతలు
- సాగుచేసే రకాన్ని బట్టి చెల్లింపులు
- సంబంధిత మండలాల్లోనే దరఖాస్తు చేసుకునే వెసులబాటు
- జిల్లాలో 2022-23 ఏడాదికి 1311 మంది రైతులు 1641 హెక్టార్ల విస్తీర్ణానికి దరఖాస్తులు

పార్వతీపురంటౌన్:

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉద్యానవన పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు ‘సాగు’తున్నారు. మొక్కల పెంపకానికి ప్రభుత్వం వందశాతం సబ్సిడీని రైతులకు అందజేయడంతో 5 ఎకరాలలోపు ఉన్న రైతులు మొక్కల పెంపకానికి మొగ్గు చూపుతున్నారు. తమ భూమిలోని మొక్కల సంరక్షణతో ఉపాధిహామీ వేతనం అందుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు.

అన్ని పనులకూ ఉపాధి హామీ నిధులు

ఉపాధి హామీ పథకంలో మొక్కల పెంపకానికి రైతులకు ఎలాంటి ఖర్చులు లేకుండా మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది. పొలాన్ని దుక్కి చేసుకోవడానికి, గుంతలను తవ్వించేందుకు, మొక్కల కొనుగోలుకు, రవాణా, కలుపుతీత ఖర్చులు సైతం చెల్లిస్తోంది. తర్వాత మూడేళ్ల వరకూ మొక్కల పెంపకానికి అవసరమయ్యే నీటి బిల్లులు, కాపాలాదారు బిల్లులు ఇస్తోంది. కాపాలాదారుకు నెలకు ఎకరానికి రూ.1150 చొప్పున 5 ఎకరాల వరకూ చెల్లిస్తోంది. రైతులు సాగు చేసే పంట రకాన్ని బట్టి ప్రభుత్వం డబ్బు చెల్లిస్తోంది. సంవత్సరానికి ఎకరా మామిడితోటకు రూ.1.05 లక్షలు, దానిమ్మ తోటకు రూ.1.06 లక్షలు ఇలా పంట రకాన్ని బట్టి లక్షకు తగ్గకుండా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది.

అంతర పంటల సాగుకు ప్రోత్సహం

పండ్ల మొక్కల సాగుకు దరఖాస్తు చేసుకున్న రైతులకు అదనపు ఆదాయం సమకూర్చేలా 2023-24 నుంచి పండ్ల మొక్కలతో పాటు అంతర పంటగా మునగ, పూలమొక్కలు (కనకాంబరాలు, రోజా, మల్లి)ఏదో ఒకటి అంతర పంటగా సాగు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. పండ్ల మొక్కలు సాగుచేసిన నాటి నుంచి పంట చేతికొచ్చేందుకు దాదాపు ఐదేళ్ల సమయం పడుతుంది. ఈ సమయంలో రైతు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా అంతర పంటగా పూల తోటలు సాగుకు ప్రోత్సాహించేందుకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపొందించింది. ఎకరా విస్తీర్ణంలో పూలతోటలు సాగుచేసుకునే అవకాశం కల్పించింది. అంతర పంటగా పూలతోటలు సాగుచేస్తే ఏడాది పొడవునా రైతుకు ఆదాయం సమకూర్చేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

2022-23లో ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తులు ఇలా..		
నియోజకవర్గం	రైతులు	విస్తీర్ణం (హెక్టార్లలో)
కురపాం	776	891
పార్వతీపురం	63	76
పాలకొండ	242	344
సాలూరు	230	330
మొత్తం	1311	1641

ఏప్రిల్ నుంచి దరఖాస్తుల స్వీకరణ

మెట్ట భూములున్న రైతులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ ఏడాది జిల్లాలో డ్రైల్యాండ్ హార్టికల్చర్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పండ్ల మొక్కల సాగుపై ఆసక్తి ఉన్నవారు ఏప్రిల్ మొదటి వారం నుంచి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఐదెకరాలలోపు మెట్టభూమి ఉన్న రైతులు డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకానికి అర్హులు. అలాంటి రైతులు గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్‌తో సంప్రదించి ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. తక్కువ విస్తీర్ణంలో ఉన్న రైతులు సైతం పూల మొక్కల సాగుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు చేసుకోవచ్చు



ఉపాధిహామీ పథకం కింద పండ్లతోటల పెంపకానికి ముందుకు వచ్చే రైతులందరికీ ప్రభుత్వం వందశాతం సబ్సిడీ ఇస్తోంది. ఆసక్తి కలిగిన రైతులంతా సంబంధిత మండలాల్లోనే దరఖాస్తు చేసుకోవచ్చు. రైతులు ఇబ్బంది పడకుండా మొక్కలు నాటిన పొలంలోనే అంతరపంటగా ఏదైనా సాగు చేసుకోవచ్చు.

– కె.రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం

ఫైడితల్లికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి నివేదించిన అరిసెలు, బూరెలు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారికి అరిసెలు, బూరెలతో నివేదన చేశారు. అనంతరం ఆలయంలో వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

‘శ్రీరామనవమి’ వసంతోత్సవాలు ప్రారంభం



స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామివారి దేవస్థానంలో శ్రీరామనవమి కల్యాణ వసంతోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ, బాలభోగం నిర్వహించిన తరువాత 6గంటలకు విష్వక్సేనారాధన, అంకురారోపణం, ఋత్విగ్వరణం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. 7.30 గంటలకు యాగశాలలో అగ్ని ప్రతిష్టాపన, గాయత్రి రామాయణం, సంక్షేప రామాయణం, రామాయణ హవనం నిర్వహించారు. ఆలయంలోని మంటపంలో శ్రీ సీతారామ చంద్రమూర్తిని వేంచేపుజేసి పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలు, వివిధ రకాల పుష్పాలతో స్వామిని సుందరంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఋత్విక్కులు స్వామి సన్నిధిలో శ్రీమద్రామాయణ, సుందరకాండ పారాయణాలు నిర్వహించారు. అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ లక్ష తులసి, కుంకుమార్చన కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి.ఈ నెల 29వ తేదీ వరకు ప్రత్యేక పూజలు కొనసాగించి 30న శ్రీరామనవమి రోజున స్వామి కల్యాణాన్ని కనులపండువగా జరిపించనున్నామని అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక భవనంలో జిల్లా కోర్టు

- అనుమతి ఇచ్చిన ప్రభుత్వం



మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్న న్యాయవాదులు

విజయనగరం లీగల్: విజయనగరం జిల్లా కోర్టును తాత్కాలికంగా తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎంఆర్ కళాశాల సమీపంలో ఉన్న పశుసంవర్థక శాఖ భవనంలో కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం వీటీ అగ్రహారంలో ఉన్న జిల్లా కోర్టు కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ నూతన భవనాన్ని నిర్మించేందుకు హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపాయి. సుమారు రూ.113కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు, మంత్రి బొత్స సత్యనారాయణను పలుమార్లు కలిసి ప్రత్యామ్నాయ ఏర్పాటుకు భవనాన్ని మంజూరు చేయాల్సిందిగా అభ్యర్థించారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి ఉత్తర్వులు జారీ చేసే విధంగా మంత్రి బొత్స సత్యనారాయణ చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మంత్రిబొత్స సత్యనారాయణను న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ఉగాది రోజున కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ వైస్‌చైర్మన్ కోలగట్ల తమ్మన్నశెట్టి, ఐ.సురేష్, బి.సత్యనారాయణ, ఎల్.సత్యనారాయణ, కె.ఫల్గుణరావు, బి.రవి, ఎం.శంకరరావు తదితరులు ఉన్నారు.

మూడు పూరిళ్లు దగ్ధం



గరుగుబిల్లిలో కాలిపోతున్న పూరిళ్లు

మెరకముడిదాం: మండలంలోని గరుగుబిల్లి గ్రామంలో బుధవారం మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామంలోని ఎస్టీ కాలనీలో ఉదయం 9.30 గంటల సమయంలో ఇళ్లలో ఎవరూ లేని సమయంలో గ్రామానికి చెందిన సహదేవు సిమ్మ, కోంటిపల్లి అప్పలకొండ, పూసపాటి దేవిలకు చెందిన పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. వీఆర్ఓ రేగిడి సందీప్, సర్వేయరు అసిస్టెంట్ శనపతిగోవింద్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఈప్రమాదంలో సుమారు రూ.5 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని ప్రాథమిక అంచనా వేశారు. ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అయితే అప్పటికే మొత్తం కాలిబూడిదయ్యాయి. దీంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలామంటూ భోరున విలపిస్తున్నారు. ప్రభుత్వమే తమను అన్ని విధాలా అదుకోవాలని కోరుతున్నారు.

ఎలక్ట్రికల్ షాపులో అగ్ని ప్రమాదం

దత్తిరాజేరు: మండలంలోని వంగర సమీపంలో దత్తిరాజేరులో రోడ్డులో ఉన్న నాయుడు ఎంటర్ ప్రైజెస్ ఎలక్ట్రిల్, ప్లంబింగ్ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ మేరకు గజపతినగరం అగ్నిమాపక అధికారి రవిప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మజ్జి అప్పలనాయుడు, త్రినాథ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న షాపును ఉగాది కావడంతో తెరవలేదు, స్థానికులతో పాటు రోడ్డు మార్గాన వెళ్తున్న ప్రయాణికులు షాపులో నుంచి వస్తున్న పొగను గమనించి యజమానికి సమాచారం వెంటనే ఆయన అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేయడంతో వెళ్లి స్థానికులతో కలిసి అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. షాపులో సుమారు రూ.15 లక్షల విలువ చేసే విద్యుత్ సామగ్రి, పెయింట్లు, డబ్బులు కాలి బూడిదైనట్లు షాపు యజమానులు వాపోయారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

విజయనగరం టౌన్: సనాతన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని వాగ్దేవీ సమారాధన సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ఉన్న చా.సో భవనంలో బుధవారం ఉగాదివేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త చివుకుల శ్రీలక్ష్మికి ఉగాది పురస్కారంతో పాటు ‘వాగ్దేవీ సాహితీసుధ’ బిరుదుతో జ్ఞాపికనందించి, దుశ్శాలువ, గజమాలతో సత్కరించారు. కార్యక్రమానికి ముందు కవన విజయం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్తలు వారి కవితలను చదివి వినిపించారు. సద్గురు నిలయం ఉషాకామేశ్వరీ బృందం ఆలపించిన భక్తిగీతాలాపన ఆద్యంతం ఆకట్టుకుంది. నర్తనశాల డైరెక్టర్ డాక్టర్ భేరి రాధికారాణి నృత్యబృందం చేసిన నృత్యప్రదర్శనలు రక్తికట్టించాయి. అనంతరం సేవా, సంగీత, సంప్రదాయ పరిరక్షణ, సాహిత్య, శాస్త్ర, ఆధ్యాత్మిక రంగాల్లో సేవలందించిన డాక్టర్ జ్యోతి ఫెడ్రిక్, రెయ్యి శంకర్ రెడ్డి, ఎం.భీష్మారావు, బంటుపల్లి వెంకటరావు, డాక్టర్ ఎస్. అచ్చిరెడ్డి, మోదేకుర్తి వెంకట కామేశ్వర శర్మ, బులుసు సరోజిని, పాణంగిపల్లి వెంకట నరసింహాచార్యులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేవీ తిరుమలాచార్యులు, ఈశ్వర వెంకట రామనాథ శాస్త్రి, పల్లంట్ల వెంకట రామారావు, అనూరాధా పరశురామ్, పెంకి చైతన్య కుమార్, అధిక సంఖ్యలో కవులు, రచయితలు, విద్యార్థులు, అభిమానులు పాల్గొన్నారు.

అన్నార్తుల ఆకలి తీర్చడమే లక్ష్యం



అన్నం వడ్డిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

అన్నార్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా విజయనగరంలో ఫుడ్ బ్యాంకులను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. ఇప్పటికే నాలుగు ఫుడ్‌బ్యాంకుల్లో అన్నదానం చేస్తుండగా, న్యూపూర్ణ జంక్షన్ వద్ద కొత్తగా మరో ఫుడ్ బ్యాంకును ఆయన బుధవారం ప్రారంభించారు. ముందుగా పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేసి అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పేదలకు ఆయన స్వయంగా ఆహార పదార్థాలను వడ్డించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఫుడ్‌బ్యాంకులు పేదప్రజల ఆకలి తీర్చుతున్నాయన్నారు.

ఫుడ్‌బ్యాంకుల నిర్వహణకు దాతలు అందిస్తున్న సాయం గొప్పదన్నారు. గతంలో అన్నా క్యాంటీన్ల పేరిట నిధులు దుర్వినియోగమయ్యేవని, ఇప్పుడు స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో ప్రతిరోజు ఒక్కోఫుడ్ బ్యాంకులో 150 మందికి ఆహారం అందుతోందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతీదేవి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రతినిధి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

అతివకు అందలం

- ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట
- పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ
- ఒక్కో యూనిట్‌కు రూ.లక్ష నుంచి 2 లక్షల వరకు రుణం
- మార్కెట్ అవకాశాలపై దిశానిర్దేశం చేయనున్న అధికారులు



పుట్టగొడుగుల పెంపకంపై డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

బొండపల్లి: గ్రామాల్లోని మహిళలు చుట్టూ ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికస్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తోంది. అందులో భాగంగానే గ్రామాల్లోని డ్వాక్రా గ్రూపుల్లో ఉత్సాహంగా ఉన్న మహిళలను గుర్తించి వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకుగాను డీఆర్‌డీఏ ద్వారా శిక్షణ ఇచ్చి వారు సొంతంగా గ్రామాల్లోనే స్వయం ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంటోంది. పుట్టగొడుగుల పెంపకంతో చాలా తక్కువ పెట్టుబడి, తక్కువ సమయంలో ఆదాయం పొందడానికి అవకాశం ఉండడంతో పాటు బహిరంగ మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉండడంతో ప్రధానంగా వాటి పెంపకంపై మహిళలకు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి పొందేలా చర్యలు చేపట్టింది.

జిల్లాలో ప్రథమంగా బొండపల్లిలో శిక్షణ

పుట్టగొడుగుల పెంపకంపై జిల్లాలోనే ప్రథమంగా బొండపల్లి మండలంలోని గ్రామాల్లో ఉత్సాహంగా ఉన్న డ్వాక్రా సంఘాల్లోని మహిళలను గుర్తించి 10 రోజుల పాటు శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్లు కూడా అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మండల వ్యాప్తంగా ప్రయోగాత్మకంగా 32 మంది మహిళలను గుర్తించి వారికి పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణతో పాటు మార్కెట్ అవకాశాలు, నిర్వహణ, ఏవిధంగా చేస్తే మంచి లాభాలు వస్తాయన్న అంశాలపై అవగాహన కల్పించారు. ఇందుకోసం డీఆర్‌డీఏ అధికారులు మండలాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి కొంతమంది ఉత్సావంతులైన మహిళలను గుర్తించారు.

ఆర్థికంగా మహిళల బలోపేతానికి కృషి



మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోంది. గ్రామాల్లోనే ఉంటూ ఆదాయం సంపాదించుకునేలా శిక్షణ ఇస్తున్నాం. ప్రయోగాత్మకంగా బొండపల్లి మండలంలో డ్వాక్రా మహిళలను గుర్తించి పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చాం. దశల వారీగా జిల్లాలోని అన్ని మండలాల్లో శిక్షణ ఇవ్వనున్నాం.

– ఎ.కల్యాణ చక్రవర్తి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, విజయనగరం

శిక్షణతో పాటు రుణాలు అందించేలా ప్రణాళికలు



ఉత్సాహంగా ఉన్న మహిళలకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇవ్వడంతో పాటు యూనిట్‌ను నెలకొల్పేందుకు ముందుకు వచ్చిన వారికి పెంపకం స్థాయిని బట్టి రుణాలు కూడా ఎస్‌బీఐ ద్వారా అందించడానికి చర్యలు తీసుకుంటాం. తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయడంతో పాటు నెలవారీ వాయిదాలు చెల్లించడానికి అవకాశం కల్పిస్తాం.

– జీవీబీ రమణ ఎస్‌బీఐ (స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్)

ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ద్వారా శిక్షణ

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా డీఆర్‌డీఏ అధికారులు మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఎంపిక చేసిన మహిళలకు శిక్షణతో పాటు పుట్టగొడుగుల పెంపకం వల్ల ఎంత మేరకు లాభాలు పొందవచ్చు? మార్కెట్‌కు ఉన్న అవకాశాలు తదితర అంశాలన్నింటిపై ఆ సంస్థకు చెందిన డైరెక్టర్లు 10 రోజుల పాటు అవగాహన కల్పించారు. అలాగే శిక్షణ పొందిన మహిళల్లో ఉత్సాహవంతులైన వారు పుట్టగొడుగుల పెంపకం యూనిట్‌ను స్థాపించడానికి ముందుకు వస్తే వారికి ఎస్‌బీఐ ద్వారా యూనిట్‌ను బట్టి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు 10 రోజుల్లోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు మహిళలకు సూచించారు.

తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం

పుట్టగొడుగుల పెంపకంతో కేవలం 45 రోజుల్లోనే ఫలితం చేతికి అందివస్తుంది. ఇంట్లోనే చిన్న, చిన్న రెండు గదులు ఉంటే దీనికి సరిపోతుంది. కేజీ విత్తనంతో మూడు కేజీల వరకు పుట్టగొడుగులను పండించవచ్చు. కేజీ విత్తనం ధర రూ.150 కాగా పండించిన పుట్టగొడుగుల కేజీ ధర రూ.300 నుంచి రూ.400 వరకు ఉండే అవకాశం ఉంది. సరాసరి అన్ని ఖర్చులు పోను పెంకందారుకు కేజీ విత్తనంతో రూ.600 వరకు లాభం పొందే అవకాశం ఉంది.

● భక్తజన జాతర



గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని ఉమాసహిత కైలాసనాథ స్వామి ఆలయ వార్షికోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు నిర్వహించిన పంచమరాత్రి జాతరకు భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. చివరిరోజు జాతరకు తరలివచ్చినవారితో గుమ్మలక్ష్మీపురం భక్తసంద్రంగా మారింది. - గుమ్మలక్ష్మీపురం